మధుర ఫలం.. విషపూరితం

- మామిడికాయలు మాగబెట్టడానికి విచ్చలవిడిగా రసాయనాల వాడకం
- రోగాలను కొని తెచ్చుకున్నట్లేనంటున్న వైద్య నిపుణులు
- తనిఖీలు చేయని అధికారులు



విక్రయించడానికి సిద్ధంగా ఉన్న మామిడికాయలు

గుడ్లవల్లేరు: నవ నవలాడే బంగారు ఛాయలో ఉండే మామిడి పండ్ల మాటున విష రసాయనాల పంజా విచ్చలవిడిగా మారింది. మార్కెట్‌కు వెళ్లి అనారోగ్యాన్ని కొని తెచ్చుకున్నట్లుగా నేటి పరిస్థితులు మారాయి. ఈ సీజన్‌లో మామిడి పండు రారాజు. ఇవి కొని.. తినేందుకు అందరూ ఆసక్తి చూపుతున్నారు. అయితే ఆరోగ్యానికి ప్రాధాన్యమిచ్చే వారు మాత్రం ఆలోచిస్తున్నారు. మామిడి కాయలను మాగబెట్టడానికి విచ్చలవిడిగా రసాయనాలు వాడుతుండటమే ఇందుకు కారణం. ప్రస్తుతం మార్కెట్లో విక్రయిస్తున్న పండ్లు తింటే ఆరోగ్యం దెబ్బ తింటుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. పక్వానికి రాని, గాలీ వానలకు రాలిన కాయలను విషపూరిత రసాయనాలతో మాగబెడుతుండటంతో ఆరోగ్యానికి హానికరంగా మారాయి.

అనారోగ్య సమస్యలు

గోడౌన్‌కు తరలించిన మామిడి కాయలను మొదట మ్యాంకోజబ్– 45 అనే పౌడర్‌ను ఒక లీటరు నీటికి ఒక మిల్లీలీటరు చొప్పున వేస్తారు. ఆ నీటిలో ఈ పచ్చి కాయలను ముంచి పక్కన పెడతారు. తర్వాత ఎథిలిన్, కాల్షియం కార్బైడ్ తదితర బిళ్లలు, రసాయనాలను నీటిలో వేస్తే దాని నుంచి రోగాలను కొని తెచ్చుకున్నట్లే. రసాయనాలతో మాగబెట్టిన పండ్లు తినడంతో అది విడుదల చేసే ఆర్సెనిక్ యాసిడ్ కారణంగా కాలేయం, మూత్రపిండాలకు సంబంధిత సమస్యలు రావచ్చని వైద్యులు చెబుతున్నారు. సీజన్‌లో దొరికే సహజ సిద్ధంగా మాగబెట్టిన పండ్లను తినడం మేలు అని అంటున్నారు.

ఇంజెక్షన్ల ద్వారా కాయల్లోకి రసాయనాలు

రసాయనాలు చల్లిన 24గంటలకే రంగు మారిన మామిడిపై ప్రమాదకరమైన కార్బైట్ గుళికలు గ్యాస్ ఫామ్ అవుతుంది. ఓ గదిలో కాయలను ఉంచి ఈ గ్యాస్‌ను వదిలి ఆ గదిలోకి గాలి పోకుండా చేస్తారు. మరోవైపు వేపర్ ట్రీట్‌మెంట్ పేరిట కాయలను బంధీ చేసిన గదుల్లోకి విషపూరితమైన మిథైల్ గ్యాస్‌ను వదిలి పెడతారు. దీంతో 24 గంటల్లోనే పచ్చి కాయలకు సైతం మంచి రంగు వచ్చి పండ్లుగా మారుతున్నాయి. మరికొంత మంది ఇంజెక్షన్ల ద్వారా కాయల్లోకి రసాయనాలు పంపి మాగబెడుతున్నారు.

పట్టించుకోని అధికారులు

విషపూరితమైన రసాయనాలతో మాగబెట్టిన పండ్లను దుకాణాల్లో యథేచ్ఛగా విక్రయిస్తున్నా వీరిపై చర్యలు లేవు. అనారోగ్యానికి గురవ్వకుండా పట్టించుకునేవారే కరువయ్యారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, ఆహార కల్తీ నిరోధక శాఖ ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ అసలు పట్టించుకోవడం లేదు.

తనిఖీలు నిల్



బుట్టల్లో మాగబెట్టిన మామిడికాయలు

కొన్నేళ్ల క్రితం ఏ కాయలను అయినా మాగబెట్టేందుకు సహజ సిద్ధంగా ఊదర ప్రక్రియ, బోద కసువులో పెట్టే పద్ధతులు ఉండేవి. ఇప్పుడు అవి చూద్దామన్నా కనిపించడం లేదు. నిర్ణీత రుసుము చెల్లిస్తే పచ్చి కాయలను ఇట్టే రసాయనాలతో మాగబెట్టే గోదాములు కూడా వెలిశాయి. మామిడి కాయలను రసాయనాల ద్వారా మాగబెట్టడంపై నిషేధం ఉంది. కార్బైడ్‌ను వినియోగించినట్టు తనిఖీల్లో తేలితే మూడేళ్ల జైలు శిక్ష తప్పదు. ఇప్పటికే మామిడిని మాగబెట్టే సెంటర్లను మార్కెటింగ్, హార్టికల్చర్, సచివాలయ సిబ్బంది తనిఖీ చేయవలసి ఉంది. అవసరమైతే మామిడి మార్కెట్లో పండ్లను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల ద్వారా రసాయనాలపై పరీక్షలు చేయించాలి.

క్లుప్తంగా

సింగలూరులో సీసీ కెమెరాల ఏర్పాటు

గుడ్లవల్లేరు: గుండ్లవల్లేరు మండలం సింగలూరు గ్రామంలో దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గుడ్లవల్లేరు పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏడు సీసీ కెమెరాలను శ్రీ భాగ్య విధాత చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఎస్‌ఐ ఎన్‌వీవీ సత్యనారాయణకు ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు. దాత హైదరాబాదుకు చెందిన ఏపీ సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల అధినేత డాక్టర్ జీ విజయ్ శ్రీనివాస్ రూ. 55వేల ఖరీదైన సీసీ కెమెరాలను తమ గ్రామానికి అందించారని డాక్టర్ శ్యామ్‌కుమార్ తెలిపారు.

ఎట్టకేలకు ముసుగు తొలగించారు



సాక్షి ఎఫెక్ట్

గుడివాడ టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా వేసిన ముసుగును శనివారం తొలగించారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే రాజకీయ నాయకులకు తొడిగిన ముసుగులను అధికారులు తొలగించాలి. కానీ ఎన్నికలు ముగిసి రెండు నెలలు పూర్తయినా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి ముసుగు తొలగించలేదు. దీనిపై సాక్షి దినపత్రిక శనివారం 'మహానేత విగ్రహానికి ముసుగు తీయరా..?' అంటూ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన మున్సిపల్ అధికారులు ఎట్టకేలకు ముసుగు తొలగించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

గుడివాడ టౌన్: స్థానిక మందపాడులోని పురపాలక సంఘం నైట్ షెల్టర్ వృద్ధాశ్రమంలో శనివారం ఆర్‌కే వారియర్స్ ఆధ్వర్యంలో భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీ గోపిక, ఎల్ రాంబాబు, జీ చరణ్ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య పరీక్షలు

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యాన స్థానిక లయన్స్ సేవా భవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ శనివారం తెలిపారు. రోగులకు 15రోజులకు సరిపడా ఉచిత మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూసమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థికసాయంతో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు పర్యవేక్షించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తీర్థప్రసాదాల్ని స్వీకరించారు.

ఉపాధి హామీ జాబ్ కార్డులను పరిశీలించాలి

నందివాడ: స్థానిక మండల ప్రజాపరిషత్ ఆఫీసులో ఎంపీడీఓ మల్లీశ్వరి ఉపాధి హామీ పథకంపై ఫీల్డ్ అసిస్టెంట్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం నుంచి గ్రామసభలు నిర్వహించి జాబ్ కార్డులను పరిశీలన చేయాలన్నారు. ఉపాధి వేతనదారులతో ఇన్సూరెన్స్ కట్టించాలని, అలాగే అందరికి పని కల్పించి జాబ్ కార్డులు లేని వారికి కొత్తగా కార్డులు ఇవ్వాలని సూచించారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ఎంఈఓ శ్రీనివాసరావు, మురళీకృష్ణ

పామర్రు: పద్మశ్రీ ఘంటసాల – ఎన్టీఆర్ స్మారక సంగీత కళాపీఠం ఆధ్వర్యంలో శనివారం పదవ తరగతిలో పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానం వచ్చిన విద్యార్థులకు ఎన్టీఆర్ ప్రతిభా పురస్కారాలను స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి లంక నరేంద్ర గృహంలో అందజేశారు. ఎంఈఓ బొడ్డు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని పామర్రు, గుడ్లవల్లేరు మండలాల పరిధిలో ఉన్న 18 హైస్కూల్స్‌లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. విద్యార్థులకు మెమోంటో, ప్రశంసా పత్రాలను అందించి వారి తల్లిదండ్రులకు సన్మానం చేశారు. ఘంటసాల కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీకృష్ణ, గౌరవ అధ్యక్షుడు కోటి పాండురంగారావు, కార్యదర్శి నందిపాటి హేమంత్‌రెడ్డి, పామర్రు ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్, విశ్రాంత ప్రిన్సిపాల్ ముక్తేశ్వరరావు, గురుస్వామి, బాపట్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మను మించిన దైవం లేదు



తోట్లవల్లూరులో చిన్నారులను ఆశీర్వదిస్తున్న తల్లులు

గుడ్లవల్లేరు: ఈ సృష్టిలో అమ్మను మించిన దైవం లేదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి అన్నారు. గుడ్లవల్లేరు మండలంలోని పెంజెంద్ర ప్రీ స్కూల్లో శనివారం మాతృ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. తల్లులకు విద్యార్థులతో పాదాభి వందనం చేయించి మాతృమూర్తి విశిష్టను చాటారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో...

తోట్లవల్లూరు: మండల కేంద్రమైన తోట్లవల్లూరులో మదర్స్ డే సందర్భంగా స్థానిక ఎస్టీ ఏరియా అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లికి వందనం కార్యక్రమం నిర్వహించారు. తల్లులు పిల్లలకు అక్షింతలు వేసి దీవించారు. అలాగే కిశోర వికాశంలో భాగంగా బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు తదితర అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కలిగించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కోకిలా రాణి, భాగ్యం, చిన్నారుల తల్లులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

మొవ్వ: మొవ్వ మండలంలోని 67 అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం మదర్స్ డే వేడుకలు నిర్వహించారు. మొవ్వ, నిడుమోలు, కూచిపూడి సెక్టార్ సూపర్‌వైజర్స్ ఏనుగు పుణ్యవతి, అబ్దుల్ సలీమున్నీసా, ఏఎస్ కళ్యాణిల ఆధ్వర్యంలో ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులకు పాదాభివందనం చేయించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

రాయితీపై పశువుల దాణా పంపిణీ



దాణా అందజేస్తున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు: ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేస్తున్న పశువుల దాణాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ సూచించారు. ట్రావెలర్స్ బంగ్లాలో ముదినేపల్లి, మండవల్లి మండలాలకు చెందిన రైతులకు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో శనివారం పశువుల దాణా పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్‌లో 50 కిలోల దాణా బస్తా ధర రూ. 1,110 ఉండగా 50 శాతం రాయితీతో రైతులకు రూ. 555కే ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. మండవల్లి, కైకలూరు పశుసంవర్థక శాఖ ఏడీలు డీ వరప్రసాద్, పఠాన్ ముస్తాఫా ఖాన్, కైకలూరు వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ పాల్గొన్నారు.

మత్తుకు బానిసలు కావొద్దు



మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిబ్బంది

చావలిపాడు(కైకలూరు): మత్తు పదార్థాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సీఐ ఎస్‌కే రమేష్ సూచించారు. మండవల్లి మండలం చావలిపాడులో నర్సిపల్లి అప్పారావు చేపల ఐస్ ప్యాకింగ్ ఫ్యాక్టరీలో కార్మికులు, సిబ్బంది, డ్రైవర్లకు మత్తు పదార్థాల వాడకంతో కలిగే అనర్థాలపై శనివారం అవగాహన కల్పించారు. కైకలూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఎస్‌ఐ పీ ఆదినారాయణ మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా మత్తు పదార్థాల వ్యసన విముక్తి కేంద్రం పని చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, సిబ్బంది ధనుంజయ, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

అలరించిన భామా కలాపం



ఎలకుర్రు(పామర్రు): గ్రామంలో వేంచేసియున్న శ్రీ భ్రమరాంబ చెన్నమల్లికార్జున స్వామి ఆలయ వార్షిక కల్యాణ మహోత్సవంలో భాగంగా శనివారం నిర్వహించిన శ్రీ సిద్ధేంద్ర కృత భామా కలాపం నాటకం ప్రేక్షకులను అలరించింది. భామా కలాపంలో సత్యభామగా కేంద్ర సంగీత నాటక అకాడమీ రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్ నటించారు. శ్రీకృష్ణగా దూరదర్శన్ నటుడు వేదాంతం సిద్ధేంద్ర వరప్రసాద్, మాధవిగా కురవి సుబ్రహ్మణ్య వరప్రసాద్, సూత్రధారిగా ఏలేశ్వరపు వెంకటేశ్వర్లు, నర్తకలుగా పసుమర్తి వెంకటనరసింహ ఫణీంద్ర, వేదాంతం కావ్యశ్రీ, హర్ష అకీర, లక్ష్మి, నేహాగౌడ్ నటించారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కాశీనాథుని నాగేశ్వరరావు, ముదిగొండ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నందివాడ: మండల పరిధిలోని రుద్రపాక గ్రామంలో జెడ్పీ హైస్కూల్లో శనివారం 2005–06 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. పూర్వ విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత ఒకచోట కలుసుకుని ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ డేవిడ్ రత్నరాజు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మొవ్వ అగ్నిమాపక కేంద్రానికి చేయూత

మొవ్వ: మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని మండవ జానకిరామయ్య సులోచన క్షేత్రయ్య కల్యాణ మండపం అభివృద్ధి నిధులతో మొవ్వ అగ్నిమాపక కేంద్రంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. కల్యాణ మండపం ద్వారా అందించిన రూ. 1.05 లక్షలతో ఫైర్ స్టేషన్‌ను రంగులతో తీర్చిదిద్దారు. మండల గోపి నేతృత్వంలో తాతినేని శరత్, నర్రా నారాయణరావు పనులను నిర్వహించారు.

ఆలయ అభివృద్ధికి వితరణ

గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులో వేంచేసియున్న శ్రీవిఘ్నేశ్వరస్వామి దేవస్థానం ఆలయ ముఖ మండపం అభివృద్ధికి భక్తులు వితరణ ఇచ్చినట్లు ఆలయ ఈఓ వై. శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణానికి చెందిన యార్లగడ్డ వెంకటలక్ష్మి రూ. 10,116 వితరణగా అందజేసినట్లు పేర్కొన్నారు. ఆలయ అర్చకులు వెంకటలక్ష్మికి ఆశీ ర్వాదాలు అందజేసినట్లు ఆయన తెలిపారు.

వైభవంగా దేవరమ్మ సంబరం

పమిడిముక్కల: మంటాడ గ్రామంలో శనివారం మేరుగ దేవరమ్మ సంబరం వైభవంగా జరిగింది. డప్పు వాయిద్యాలు, మేళతాళాలతో దేవరమ్మ తల్లిని గ్రామంలో ఊరేగించారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా టీడీపీ నాయకులు జక్కా శ్రీనివాసరావుతో కలిసి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

సంక్షిప్త వార్తలు

180 మందికి వైద్య పరీక్షలు

కైకలూరు: కలిదిండి మండలం భాస్కరరావుపేట గ్రామంలో వైద్యుడు కారే బుజ్జిబాబు ఆధ్వర్యంలో విజయవాడ పల్లెం పెద్దేశ్వరరావు హార్ట్ క్లినిక్ వైద్యుడు పల్లెం ఆకాష్ బృందం ఉచిత వైద్య శిబిరం నిర్వహించింది. 180 మందికి వివిధ వైద్య పరీక్షలు చేశారు. సర్పంచ్ గద్దె ఆనందకుమార్, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు, నీటి సంఘం అధ్యక్షుడు మంతెన సుబ్బరాజు, అల్లూరి సతీష్ రాజు, మాండ్రు బోసు పాల్గొన్నారు.

భజన గురువు వెంకట్రామిరెడ్డి శత జయంతి

పామర్రు: స్థానిక విష్ణాలయంలో చెక్క భజన గురువు వెంకట్రామిరెడ్డి శత జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భజన గురువు కొల్లి నారాయణరెడ్డి మాట్లాడుతూ పిన్న వయసులోనే రాములవారి చెక్క భజన చేయడమే కాకుండా ఎంతో మందికి చెక్క భజనను నేర్పిన గురువు బొమ్మారెడ్డి వెంకట్రామిరెడ్డి అని పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మరక్షణ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో చెక్క భజనను నేర్పించి కళ వ్యాప్తికి కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వెంకట్రామిరెడ్డి కుటుంబ సభ్యులు తార, జయలక్ష్మి, సుధారాణి, భజన సభ్యులు దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి, మనోహర్‌రెడ్డి, వంశీరెడ్డి, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథుడి కల్యాణోత్సవాలు ప్రారంభం

ముదినేపల్లి రూరల్: రెండో పూరీగా ప్రసిద్ధి చెందిన మండలంలోని వడాలి శ్రీజగన్నాథస్వామి కల్యాణోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామివార్లను పెళ్లి కుమారుడు, కుమార్తెగా అలంకరించి పూజలు చేశారు. ముదినేపల్లికి చెందిన కట్టా లక్ష్మీ రత్నకుమారి ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం నిర్వహించారు.

సైనికుల కోసం ప్రత్యేక పూజలు

కైకలూరు: దేశ సరిహద్దుల్లో వీరోచితంగా పోరాటం చేస్తున్న సైనికులు విజయం సాధించాలని పలు పార్టీల నేతలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కైకలూరు మీసాల వెంకన్న దేవాలయంలో సుదర్శన హోమం, శ్యామలాంబ ఆలయం, వినాయకుడి గుడిలో సైనికుల విజయం కోసం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, ఏలూరు జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కీర్తి వెంకట రామప్రసాద్, నాయకులు పూలారాజీ, కొల్లి బాబీ, గరికిపాటి రాంబాబు, బోయిన శ్రీనివాసరావు, చెరుకువాడ బలరామరాజు, బొల్లా శ్యామలరాజు, బలే చిరంజీవి, ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ పాల్గొన్నారు. కలిదిండి మండలం కోరుకొల్లు గ్రామంలోనూ సైనికులు విజయం సాధించాలని పూజలు చేశారు.

సూర్యఘర్ పథకంపై అవగాహన

వెంట్రప్రగడ(పెదపారుపూడి): పీఎం సూర్యఘర్ పథకం ప్రజలకు వరం లాంటిందని గుడివాడ విద్యుత్ శాఖ ఈఈ జీవీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ కల్యాణ మండలంలో సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ వెంట్రప్రగడ గ్రామాన్ని సూర్యఘర్ ఆదర్శ గ్రామంగా ఎంపిక చేయడం జరిగిదన్నారు. యూనిట్ నెలకొల్పేందుకు అవసరమైన నిధులను బ్యాంకర్లు రుణం కింద అందజేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వంగా శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ డీఈ కిరణ్‌బాబు, మండల విద్యుత్ శాఖ ఏఈ వర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలు లేక ప్రమాదాలు

మండవల్లి: మండవల్లిలోని 165 జాతీయ రహదారిపై విద్యుత్ దీపాలు లేక పలు ప్రమాదాలు జరుగుతున్నాయని ఐక్య వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, జిల్లా కన్వీనర్ టీ అప్పారావు అన్నారు. హైవే నిర్మాణ పనులు పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ హైవే పనులు దాదాపుగా పూర్తయి, డివైడర్ నిర్మాణం చేపట్టినప్పటికీ స్తంభాలకు విద్యుత్ దీపాలు అమర్చకపోవడంతో హైవే అంధకారంలో ఉంటుందన్నారు. రోడ్డుకు ఇరువైపులా లైట్లు లేకపోవడంతో సరైన కాంతి లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

నేటి నుంచి కల్యాణోత్సవాలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని అల్లూరు పార్వతీ సమేత సోమేశ్వరస్వామి తృతీయ వార్షిక కల్యాణోత్సవాలు ఆదివారం నుంచి మంగళవారం వరకు జరగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామివారిని పెళ్లి కుమారుడిగా, అమ్మవారిని పెళ్లి కుమార్తెగా అలంకరిస్తారు. సోమవారం రాత్రి దివ్యకల్యాణం నిర్వహిస్తారని ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం గ్రామంలో స్వామివారి ఊరేగింపు నిర్వహించడంతో పాటు అఖండ అన్నసమారాధన జరుగుతుందని పేర్కొన్నారు.

ఘనంగా ఆలయాల్లో వార్షికోత్సవాలు



గుడ్లవల్లేరు: కొతవరం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ దేవస్థానం, శ్రీగంగా పార్వతీ సమేత సిద్ధేశ్వరాలయం, గుడ్లవల్లేరు శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామివారి ఆలయాల వార్షికోత్సవాలను శనివారం ప్రారంభించారు. స్వామివార్లను పెండ్లి కుమారులను చేసి వేద మంత్రోచ్ఛరణ నడుమ వార్షికోత్సవాలను నిర్వహించారు. అలాగే వెణుతురుమిల్లి శ్రీరామ లింగేశ్వరస్వామి ఆలయం, శ్రీకోదండ రామస్వామి ఆలయాల ఉత్సవాల్లో భాగంగా తీర్థపు బిందె, నిత్యొపాసన, బలిహరణ కార్యక్రమాలను వేద పండితులు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

రేపు బుద్ధ పౌర్ణమి వేడుకలు



విలేకరులతో మాట్లాడుతున్న జయరాజు తదితరులు

గుడివాడ టౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్డులోని బౌద్ధ స్థూపం వద్ద సోమవారం నిర్వహించనున్న బుద్ధ పౌర్ణమి వేడుకలు జయప్రదం చేయాలని ఆదిమాంధ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు పీ జయరాజు కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం స్థానిక నెహ్రూ చౌక్ సెంటర్ నుంచి బౌద్ధ స్థూపం వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం బౌద్ధ స్థూపం వద్ద వేడుకలు జరుగుతాయని బౌద్ధప్రియులు, విద్యార్థులు, యువత ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ చైర్మన్ పీ వేణుగోపాలరావు, దారం కరుణాకర్, గుత్తా చంటి, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.